విద్యానగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి


విద్యానగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్ ఫేస్–2లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్ ఫేస్–2 వీకర్‌సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌తో కలిసి కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యానగర్ ఫేస్–2లో సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయన్నారు. గత పది సంవత్సరాల నుంచి కాలనీలో అనేక సమస్యలు ఏర్పడ్డాయన్నారు. కాలనీకి నీటి సరఫరా అందడం లేదన్నారు. డ్రైనేజీ పనులు సైతం సగంలోనే ఆగిపోయాయన్నారు. కరెంటు స్తంభాల ఏర్పాటు లేకపోవడంతో కాలనీ మొత్తం అంధకారంలో ఉంటుందన్నారు. రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయన్నారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి.దస్తయ్య, ఉపాధ్యక్షులు ఎం.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్‌యాదవ్, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల తరువాత అపూర్వ కలయిక

1979వ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1979 బ్యాచ్ విద్యార్థులు

రాజేంద్రనగర్: ఒకటి కాదు... రెండు కాదు.. 45 సంవత్సరాల అనంతరం వారంతా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. దేశం నలుమూలలతో పాటు విదేశాల్లో నివసించిన వారు సైతం ఈ ఆత్మీయ సమ్మేళనానికి రావడం విశేషం. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ పాఠశాల 1979వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రీన్ సిటీ ప్రాంతానికి చెందిన జగదీశ్ చంద్ర ఆధ్వర్యంలో గ్రీన్ సిటీలోని తన ఫామ్ హౌజ్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి దేశం నలుమూలల్లో నివసించిన వారితో పాటు విదేశాల్లో ఉన్న ముగ్గురు మిత్రులు హాజరై ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నాడు సంగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడ్డారని, అనంతరం పిల్లల పెళ్లిళ్లు చేసి కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించి రిటైర్డ్ అయి తమ కుమారులు, కుమార్తెల వద్ద ఉంటున్నారని తెలిపారు. వారందరి ఫోన్ నంబర్లను దాదాపు సంవత్సర కాలంగా సేకరించి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల తరువాత అప్పటి మిత్రులను కలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతస్థాయికి ఎదిగినా పాఠశాల రోజులు మళ్లీ రావని ఆనాటి స్మృతులను తలచుకున్నారు. ఈ సందర్భంగా వారివారి యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.

చెత్తకుప్పలను తొలగించండి మహాప్రభో..!


లంగర్‌హౌస్ బాపూఘాట్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు, చెత్తాచెదారం

అత్తాపూర్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న రోజుల్లో రోగాలు ప్రబలకుండా చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అత్తాపూర్ ఓల్డ్ విలేజ్ ఇందిరాగాంధీ స్టాచు రోడ్డు మార్గం ముష్కిమహల్ మీదుగా రాంబాగ్ వెళ్లే ప్రధాన రహదారిలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంలో జీహెచ్ఎంసీ సిబ్బంది విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. అది కాకుండా చెత్తడంపు చేసే ప్రాంతంలో అమ్మవారి దేవాలయం కూడా ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా ప్రాంతంలో తిరుగుతూ ఆదారిగుండా వెళ్లే వారిపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారులను నిల్వ చేయకుండా తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

లోక కల్యాణం కోసం పర్యటన


అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలోని సభ్యులు

రాజేంద్రనగర్: లోక కల్యాణార్థం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యటనను ప్రారంభించారు. కర్ణాటకలోని హంపి, కుక్కి సుబ్రహ్మణ్యం, ధర్మస్థలి మంజునాథ ఆలయం, మురుడేశ్వర్, గోకర్ణ, ముకాంబిక ప్రాంతాలను ప్రణవభక్త సమాజం సభ్యులు, సంఘసేవకులు, పుర ప్రముఖులు పూజ కార్యక్రమంలో పాల్గొని ఈసారి తెలంగాణలో, దక్షిణ భారతంలో వానలు బాగా కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు కోలన్ సుభాష్ రెడ్డి, కొండమీది హరినాథ, కొమురయ్య, జైనాథ్ రెడ్డి, ఎస్.విజయ్ కుమార్, కొంగల బుచ్చన్న, మేడం మధు, రాములు, సిరిపాల్, కమలేకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

31న నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు ఎన్నికల సంఘం తేదీ నిర్ణయించింది. ఈనెల 31వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారిని ఎన్నుకోవాలని, సభ్యులకు 29వ తేదీ వరకు నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. 31వ తేదీ సమావేశం నిర్వహించలేని పరిస్థితి ఉంటే జూన్ 1వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సహాయ కార్యదర్శి సి. పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్ యాదవ్‌లపై ఈనెల 18వ తేదీన అవిశ్వాసం పెట్టి వారిని పదవినుంచి దించిన విషయం తెలిసిందే. దీంతో రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి. వాటిని సభ్యుల కోరిక మేరకు ఇతరులను ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే 10వ వార్డు (మంచిరేవుల) కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ను చైర్‌పర్సన్‌గా, 3వ వార్డు(కోకాపేట) కౌన్సిలర్ గోపాల విజయ్‌బాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు ఇప్పటికే 18 మంది సభ్యులలో మెజార్టీ 14 మంది సభ్యులు, పార్టీ అధిష్ఠానం, నాయకులు నిర్ణయించి ప్రకటించారు. దీంతో 31వ తేదీన లాంఛనంగా వారిని ఎన్నుకునే అవకాశం ఉందని కౌన్సిలర్‌లు పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్... గతుకుల రోడ్డు
- రాత్రుల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్న ప్రజలు
- రూ.4కోట్లు వెచ్చించినా అసంపూర్తిగా రోడ్డు పనులు
- ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోని అధికారులు


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


మూత లేకుండా ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం వరకు 2.కిలో మీటర్ల వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా జరగటంతో అటు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్ నెలలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మొదలు పెట్టిన పనులను మధ్యలో నిలిపివేయడంతో ఈ రోడ్డు మార్గం ప్రమాదకరంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో మళ్లీ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటుగా వెళ్ళే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను అధికారులకు పలుమార్లు వివరించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వెల్లడిస్తున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్...

ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వెళ్ళే రహదారిపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉన్నాయి. పలు మ్యాన్‌హోల్స్ మూతలు నాసిరకమైనవి ఏర్పాటు చేయడంతో అవి కొంతకాలానికే ధ్వంసమై గుంతలుగా మారాయి. దీంతో మ్యాన్‌హోళ్లను గుర్తించకుండా అటు వైపుగా వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై కొత్త మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ. 4 కోట్లతో పనులు...

100 ఫీట్‌ల రోడ్డు నిర్మించేందుకు హెచ్ఎండిఏ ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయకపోవడంతో గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో మున్సిపల్ నిధులు సుమారు రూ. 4కోట్లతో మొదలు పెట్టిన పనులు నత్తను తలపించేలా సాగుతూ ఇప్పుడు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆ రోడ్డుగుండా ప్రయాణం సాగించడానికి వీలు లేకుండా ప్రమాదంగా మారిపోయింది. అంతేకాకుండా ప్రమాదాలు జరుగుతున్నా ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మార్గంలో కోట్ల రూపాయలతో పనులు చేపట్టి వాటిని పూర్తి చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు నిలదీస్తున్నారు.


రోడ్డు మధ్యలో గుంతలు

అధికారులు పట్టించుకోవడం లేదు..



ఈ రోడ్డులో మ్యాన్‌హోల్స్ ప్రమాదంగా ఉన్నాయి. రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డు పనులు త్వరితగతన పూర్తిచేయాలని చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న పనులు మాత్రం పూర్తిచేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– నవీన్ ముదిరాజ్, ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు)

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదర్శ్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఆదర్శ్‌నగర్ విలేజ్, మంజుబార్, ఆరాంఘర్ పిస్తాహౌజ్, కింగ్స్ సరేన్య, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కనవర్షన్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పహడీ ఫీడర్ పరిధిలోని సులేమాన్‌నగర్, చింతల్‌మెట్, పహడి ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు, ఎన్టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలోని బాబానగర్, ఎన్టీఆర్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి: చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకకుండా కొమ్మలను నరికి వేసేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గగన్‌పహాడ్ సబ్ స్టేషన్, మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, ఆప్కో కాలనీ, సాయికాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీలు ఉన్నాయి. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3గంటల వరకు దుర్గానగర్, శాంతినగర్, గణేష్ నగర్, స్వప్న థియేటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో....

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30గంటల వరకు క్రిస్టల్ టౌన్, వాది–ఇ ఫర్హాన్, సుభాన్ హిల్స్, ఆశామబాద్, దస్తగిర్ నగర్, టవర్ గల్లీ, 3 గంటల నుంచి 4.30గంటల వరకు సుభాన్ కాలనీ, ఫేజ్ 1,2 వీకర్ సెక్షన్ కాలనీ, మిలాన్ కాలనీ, హరిజన్ బస్తీ, రాజీవ్ గాంధీనగర్, పటేల్ నగర్, అబ్దుల్లా కాలనీ, 7టెంపుల్స్ రహమత్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

మణికొండలో...

మణికొండ: మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్‌ల మరమ్మతులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతారాయం ఏర్పడుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కేపీఆర్ కాలనీ, పోచమ్మ కాలనీ, మణికొండ గార్డన్ కాలనీలలో, మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు సుందర్‌గార్డెన్ శివాజీనగర్, మణికొండ గార్డెన్, మణికొండ క్వార్టర్స్, ఎంప్లాయిస్ కాలనీ, నాగేశ్వర్‌రావు వెంచర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్, వినాయక్‌నగర్, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు గ్రీన్ స్పేస్, ఏజీఎల్ ప్రాంతాలలో విద్యుత్ కోతలు ఉంటాయన్నారు.

మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌కు సన్మానం


మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న యాదాద్రి కాలనీ వాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తమవంతు బాధ్యతగా పని చేస్తామని కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. నూతనంగా మేయర్‌గా ఎన్నికైన లతాప్రేమ్‌గౌడ్‌ను యాదాద్రి కాలనీవాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మేయర్‌తో పాటు కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్రలను కాలనీ వాసులు సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ యాదాద్రి కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ శాశ్వత పరిష్కారాలు చూపిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్, శ్రీనివాసులు, రాములు, సుమన్, శోభన్, తమన్న తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

కార్పొరేషన్ భవనాన్ని పరిశీలించిన మేయర్ లతాప్రేమ్‌గౌడ్


కిస్మత్‌పూర్‌లో కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: నిరంతరం ప్రజల్లో ఉంటూ మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరాయంగా కృషి చేస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో నిర్మించిన మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని సోమవారం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని అందరికీ సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించడం జరిగిందన్నారు. అధికారులకు ప్రత్యేక ఛాంబర్లు, సమావేశ మందిరం తదితర వసతులు కల్పించారన్నారు. కార్యాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నారని త్వరలోనే ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు నిఖిలసంగారెడ్డి, అనితవెంకటేష్, అస్లాంబిన్ అబ్దుల్లా, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, నాయకులు ప్రేమ్‌గౌడ్, రాజిరెడ్డి, సంగారెడ్డి, గోపాల్‌ముదిరాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో ప్రయాణాలు..

- చిమ్మచీకటిలో మధుబన్ కాలనీ ప్రధాన రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాదచారులు, వాహనదారులు
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి


చిమ్మ చీకటిలో ఉన్న రహదారి ఇదే..

మైలార్‌దేవ్‌పల్లి: రాత్రయితే చాలు ఆ రహదారి గుండా వెళ్లిన వారికి వెన్నుల్లో వణుకుపుడుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డుపైన ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు వెలుగకపోవడంతో వాహనదారులు, పాదచారులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలో ప్రధాన రహదారిపై గత నాలుగు రోజులుగా చిమ్మచీకటిలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. మధుబన్ కాలనీ నుంచి శ్రీరామ్ కాలనీకి నిత్యం బస్సులు, లారీలు, కంటెనర్లు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని లైట్లు వెలుగకపోవటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం చిన్నపాటి వర్షం పడినప్పటి నుంచి హైమాక్స్ లైట్లు వెలగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ సిబ్బందికి అనేక మార్లు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేక పోతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి వీధి లైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

చీకటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది



మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై ఇరువైపులా ఉన్న హైమాక్స్ లైట్లు వెలగడం లేదు. శ్రీరాం కాలనీ నుంచి మధుబన్‌కాలనీ ప్రధాన రహదారిపై నిత్యం అనేక బస్సులు, లారీలు, కంటైనర్లు తిరుగుతాయి. చీకటిలో పాదచారులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన స్పందించడం లేదు. విద్యుత్ లైట్లను మరమ్మతులు జరిపించి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా.

– డివి కుమార్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

వైభవంగా స్వామివారికి పల్లకీ సేవ


స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి: టీఎన్జీవోస్ కాలనీలోని వెంకన్న గుట్టపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం రెండోరోజు అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సౌమిత్రి నారాయణ స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు యాగశాల ప్రవేశంతోపాటు పలు హోమాలు జరిపించారు. దీనిలో భాగంగా సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ చేశారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలిపురం, టీఎన్జీవోస్ కాలనీ, మధుబన్ కాలనీలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తగిన ఏర్పాటు చేశారు.

సెమ్స్ జాతీయ ఒలింపియాడ్‌లో శారద విద్యామందిర్ విద్యార్థుల ప్రతిభ


రెండో ర్యాంకు సాధించిన అభినయ

శంషాబాద్: సెమ్స్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి (సైన్స్, మ్యాథ్స్, సోషల్) ఒలింపియాడ్‌లో పట్టణంలోని శారదా విద్యామందిర్ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులతో అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. మూడో తరగతి చదువుతున్న అభినయ జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు, నాల్గో తరగతి చదువుతున్న అభినవ్ జాదవ్ రాష్ట్ర స్థాయిలో 7 ర్యాంకు సాధించారు. అదే విధంగా పదోతరగతి చదువుతున్న నవీన్, నాల్గో తరగతి చెందిన అదిల్ షరీఫ్‌లు జోనల్ స్థాయిలో 4 ర్యాంకును సాధించారు. మూడో తరగతి చదువుతున్న నిహాల్, పదో తరగతి చదువుతున్న చాందిని జోనల్‌స్థాయిలో ఏడో ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శారద విద్యామందిర్ కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి అభినందించారు.

కాలనీ అభివృద్ధికి సహకరించండి

మున్సిపల్ చైర్మన్‌ను కోరిన తిరుమలహిల్స్ కార్యవర్గం


మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన తిరుమలహిల్స్ నూతన కమిటీ నాయకులు

మణికొండ: తమ కాలనీలో పార్కు భూమి పరిరక్షణ, ఇంటింటికీ సరిపడా మంచినీరు, రోడ్లు, వీధి దీపాలు లాంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉందని, అన్ని రంగాలలో కాలనీ అభివృద్ధికి సహకరించాలని తిరుమలహిల్స్ కాలనీ నూతన కార్యవర్గం మణికొండ మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. ఆదివారం నూతన కమిటీ ఎన్నిక కావటంతో అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో వారు సోమవారం చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ నూతన కమిటీని సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమల హిల్స్ కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి చేద్దామని, అందుకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు ఎం.భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కోశాధికారి సుభాష్‌నారాయణ్, కార్యవర్గ సభ్యురాలు బి.అనురాధ, మాజీ అధ్యక్షుడు కాంతారావులు ఉన్నారు.

'ఎంఎస్‌డబ్ల్యూ'తో అవకాశాలు మెండు

రాయదుర్గం: సోషల్ వర్క్ అనేది జాబ్ ఓరియంటెడ్ సబ్జెక్ట్ అని 'మనూ' సోషల్ వర్క్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ షాహిద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మనూ విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును అందిస్తోందన్నారు. అభివృద్ధి రంగంలో అవకాశాలు ఏటా పెరుగుతున్నాయని ఎంఎస్‌డబ్ల్యూ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఉర్దూ పరిజ్ఞానంతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ/తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో ఆసక్తి గల దరఖాస్తుదారులు ఎంఎస్‌డబ్ల్యూ కోర్సునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 30వ తేదీ అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9958222106లో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన 'సోషల్ ఇంటెలిజెన్స్ బూట్ క్యాంప్-24'

రాయదుర్గం: నానక్‌రాంగూడలో క్యాటలిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన 'సోషల్ ఇంటెలిజెన్స్ బూట్ క్యాంప్–2024' సోమవారం ముగిసింది. మూడు రోజులపాటు వక్తల ప్రసంగాలు, అనుభవాన్ని పెంచేలా వర్క్‌షాప్‌లు జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ ఉషా యనమండ్ర రచించిన 'ఎస్ఐ–ది సోషల్ ఆల్కెమీ: క్రాఫ్టింగ్ సక్సెస్ త్రూ సోషల్ ఇంటెలిజెన్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముగింపు కార్యక్రమంలో క్యాటలిస్ట్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఉషా మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి, నైపుణ్యాలు పెంచుకోవడానికి ఇవి దోహదం చేస్తాయన్నారు. అనంతరం ఈ క్యాంప్‌లో పాల్గొన్నవారికి ఉషా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.